# తను దాహం

''అమ్మ పక్కగదిలో ఉంది ....'' విసుగ్గా చిరాకుగా బుజ్జిగాడితో చెప్పి అటు పక్కకి తిరిగి పడుకున్నాడు కామేశ్వర్రావ్. పసివాడు ఇంకా బిగ్గరగా ఏడుపు లంకించుకున్నాడు.

'' అబ్బబ్బ ! ఏమి గోలరా భగవంతుడా !

ఒక్కక్షణం ప్రశాంతంగా ఉండనివ్వరు అబ్బా కొడుకులు !'' రాజ్యం గబగబా గదిలోకి వచ్చి బుజ్జిగాణ్ణి జోకొట్టి నిద్రపుచ్చింది.

మంచం మీదనుంచి ఆమె లేవబోతూఉంటే కామేశ్వర్రావ్ ఆమె రెక్క అందుకున్నాడు.

'' అబ్బ వదలండీ ! మీ సేవా, మీ పుత్రరత్నం సేవా అయ్యాకే కదా నేనా గదిలోకి వెళ్లాను !'' రాజ్యం కసురుకుంది.

'' అంటే అన్నీ నువ్ సేవగానే భావిస్తున్నావన్నమాట. నీకేం అక్కర్లేదన్నమాట ! నీకు సరదా లేదన్నమాట ... అంటే నేను నిన్ను బలాత్కరించకపోయినా, నీకు నువ్ బలవంతంగా నాకు అర్పణచేసుకుంటున్నావన్నమాట ''

కామేశ్వర్రావ్ రాజ్యం వేళ్లని తన వేళ్లలోకి పెనవేసుకొని మరీ ఆమెను నిలదీశాడు.

'' మహాప్రభో ! మీతో ఈ అర్ధరాత్రి నాకు వాదన అనవసరం. మీకు పుణ్యం ఉంటుంది.... మంచి మూడ్‌లోకి వచ్చా ! అవతల లైటు వెలిగిపోతోంది. కరెంటువృధా అయిపోయింది. మూడ్‌పోకుండా, రసవత్తరంగా కథను ముగింపుకి తీసుకురావాలి. ఆ తరువాత ...''

'' నేను గాఢనిద్రలో ఉంటాను. నువ్ బుజ్జిగాడిమీద చెయ్యివేసి పడుకుంటావ్ !'' కామేశ్వర్రావ్ వేడిగా నిట్టూర్చాడు.

'' లేదండీ ! మీ మీదే ....''

కామేశ్వర్రావ్ పట్టుకొంచెం సడలింది. చెయ్యి చటుక్కున విదిలించుకుని రాజ్యం పక్కగదిలోకి వెళ్లింది. ఎదురుగా నిలువుటద్దం.

రాజ్యం బుగ్గలు ఎర్రగా గులాబీలు పూస్తున్నాయి. కళ్లు వింతగా మెరుస్తున్నాయి.

– ఎవరివీ కళ్లు ? ఎవరివి ?

'' ఐయామ్ సారీ రాజూ !''

లైబ్రరీలో టేబిల్ మీద సరిగ్గా ట్యూబ్‌లైట్ క్రింద పుస్తకం ఉంచి పఠనంలో లీనమయిన రాజుతో అంది రంజని మెల్లగా.

ధ్యానముద్రకి భంగంకలిగి చుట్టూ చూశాడు రాజు. స్టార్టర్ ఎక్కడో దూరంగా పుస్తకాలని ర్యాకుల్లో సర్దుతున్నాడు. గున్నమామిడి విరబూస్తే ఇలాగే వుంటుందేమోననిపించే బొద్దుముద్దు గుమ్మ కుర్చీలో నుంచి ముందుకు వంగి చెక్కిలికి చేయి చేర్చి ఆలోచిస్తోంది.

కిటికీలో నుంచి క్రోటన్ గుబురుచాటున ఓ జంట కిలకిలలాడడం కనపడుతోంది. దూరంగా బార్ బెడ్ వైర్ ఫెన్స్ , కిలకిలరావాలనించి ఆమె చూపు ముళ్ల తీగవద్దకు ఆగిపోయింది.

'' .......... నాలుగురోజులైంది .... అంత కోపమైతే ఎలా ?''

''..........''

'' అబ్బ ! ఉక్కపోస్తోంది. ఎంత వేడిగా వుంది.... బీచికిపోదాం .....'' ఉస్సురని రంజని నిట్టూర్చింది.

రాజు చలించినట్టు లేదు.

''ఏమిటీ చదువు ... లవ్స్ లేబర్స్‌లాస్ట్ ! పదరాజూ .... నాకు ఆకలిగా వుంది .... క్వాలిటీలో.....''

రాజు తలఎత్తి రంజని కళ్లలోకి సూటిగా చూశాడు.

– లైబ్రరీ నుంచి క్వాలిటీకి వెళ్లేవరకూ ఆగే ఆకలయితే ఇంటికే వెళ్లచ్చుగా .... అన్న భావన ఆ చూపుల్లో నిగనిగలాడింది.

'' అబ్బ ! నువ్‌పచ్చి సైన్స్ చదువుకోవాల్సిన వాడివి ! నీ ఆలోచన అర్థమైంది కానీ లే ....''

అంత జబర్‌దస్తీగా రంజని చెయ్యిపట్టుకుని లాగుతూ ఉంటే లేవకుండా ఉండలేకపోయాడు రాజు. ఆ స్పర్శలో ఏదో మత్తున్నా రాజుకోపం తగ్గలేదు.

'' ఛీ ! ఛీ ఆడపిల్లలకు బుద్ధులుండవ్ ! బీచిలో కనుచీకటిలో తనమీద చెయ్యివేసి.... ''రాజూ ! నీకు చెల్లెళ్లు లేరూ ?'' అనేసింది పిల్ల ... జెట్‌లో నుంచి పేరాచూట్ లేకుండా క్రిందకు తోసేసినట్టు.

ఎంత రసభంగం.

తనకు ఇష్టం లేకపోతే అం.....త దూరం ఎందుకు వచ్చినట్టు !

రాజు ఆమె వెంట నడుస్తూనే రుసరుసలాడుతున్నాడు. లైబ్రరీ ఎటెండర్లూ, సహ విద్యార్థులూ విద్యార్థినులూ – వాళ్ల వేడి వేడి చూపుల తూపులను ఇరుపక్కలా నెట్టుకుంటూ రంజని బయటపడింది.

'' ఆటో !''

– రాజు ఆమెపక్క కూలబడ్డాడు.

క్వాలిటీలో సమోసా, ఐస్‌క్రీం వేసుకుని బీచిలో గొడుగు క్రింద కూచున్నాక అడిగిందిరంజని.

''నా మీద కోపం పోలేదా ?''

''పోదు''

'' ఎందుకట ?''

''నువ్వేమన్నావో గుర్తు తెచ్చుకో !''

''పెళ్లి కాకుండా మీ చెల్లెలి మీదకాబోయే వరుడే అయితే మాత్రం – చెయ్యివేస్తే నీకెలా ఉంటుంది... అదేగానేనడిగాను''

''ఛి ! ఛీ !... చెల్లి!... బొత్తిగా సైన్స్ చదవడం వల్లనేమో కొందరికి రసజ్ఞానం .... రసస్ఫూర్తి ఉండదేమో ! ఆ సమయంలో అనాల్సిన మాటేనా అది... ఇంతకీ ముట్టుకోవడమే నేరమయితే లైబ్రరీలో అంతమంది చూస్తూ ఉండగా ఛీ ! ఛీ ! ఆడవాళ్లకి బుద్ధులుండవ్'' ఖస్సుమని లేచాడు రాజు.

''పబ్లిక్ చేస్తే ఫరవాలేదు''

రాజు మొహం ఎర్రగా అయిపోయింది. రెడ్‌లైట్‌హౌస్ వెలుగేమో అనుకుంది రంజని.

''నాన్నగారు ఈపాటికి మీ ఇంట్లో నాగురించి చెబుతూ ఉంటారు... నాకు ఆఖరిగంట క్లాసు లేనందున ఇంటికి వచ్చి ఆయన్ను పంపా... ' ఇంకా రిసెర్చికానిదే ' అని మీవాళ్లంటే మాత్రం నేనూరుకోను. నేను ఇక నిన్ను కాసుకోలేను. నీకసలే వేడి ఎక్కువ... చీకటిపడిపోతోంది... ఈ మాట చెప్పడానికి వచ్చా... శలవా మరి!'' చటుక్కున లేచినుంచుంది రంజని.

ఆమెనందుకోబోయిన రాజు చేతిని లాఘవంగా తప్పించుకుని చెంగుచెంగున లేడిలా ఇసకలో అడుగులేసింది.

రాజు తెల్లబోలేదు. అతని ముఖంలో ఏదో తాపం... తనువులో ఏదో దాహం.... గుండెల్లో ఏదో ఆత్రం. మనసులో ఏదో పరవశం.

''నే పోతున్నా !'' ఒక చుంబన ధ్వనిని సాగరంవంక ఊదేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లి పోయింది రంజని.

రాజుకి అక్కడ నుంచి లేవాలనిపించలేదు. ఉరకలేసే మనసుని అదుపులో పెట్టుకోడం కష్టమై పోయిన ఏవో కొన్ని సందర్భాలు – ఆ జ్ఞాపకాలూ అతని కళ్లముందు లాస్యహేలనభినయిస్తున్నాయి.

''సినిమా చాలా బావుంది కదూ !'' పలకరింపు కాదు, పులకరింత.

''బావుంది.''

''అంటే నచ్చలేదన్నమాట... ఏమిటో ఆదీర్ఘాలోచన ? చెప్పకూడదూ !''

'' ఇక్కడా ?''

'' ఏం బాహాటంగా చెప్పకూడనిదా ?''

''మత్తెక్కించే వాసనకి బిగ్గర గొంతుండదు. మధురమైన అనుభూతికి రంగులుంటాయా ? అద్భుతమైన కాంతి రసనకందేనా ?''

''అబ్బా ! నేను కేవలం శాస్త్రమే చదువుకున్నాను. అందుకు నాకిప్పుడిప్పుడే విచారం కలుగుతోంది'' రంజని నిట్టూర్చింది ఆరోజు.

తను ఆమె చేతిలోని కర్చీఫ్ లాక్కున్నాడు దాన్ని గాఢంగా ఆఘ్రాణించాడు. ఆమె అతని కళ్లలోకి సాగరంలోకి తొంగి చూస్తున్న నింగిలా చూసింది.

సాగరమంతా తరంగమే అయి ఉవ్వెత్తున లేచి నీలాకాశాన్ని అందుకోబోయింది.

ఐతే రాజు చేతిలో ఆ రుమాలే మిగిలింది. ఆమె చేతివేళ్లు పెనవేసుకున్న తన వేళ్లలో నుంచి విడి వేరయిపోయాయి.

చటుక్కున వెనక్కి తీసుకున్న ఆమె చేతి గాజుల గలగల ఒక లిప్తకాలం తన మనసులో తంత్రీనాదాన్ని ప్రతిధ్వనించింది.

'' ఇక నేవస్తా ! మళ్లీ దర్శనం ఎప్పుడో ?''

'' ఒక్కక్షణం''

యూనివర్శిటీ అసెంబ్లీ హాలు నుంచి క్రోటన్స్ గుబుర్ల మధ్య నుంచి ఆర్ట్సు కాలేజీలోకి ప్రవేశిస్తూ ఆమెను దగ్గరగా తీసుకోబోయాడు.

''అబ్బ ! ఎవరయినా చూస్తే బావుండదు !... మీకేం పోయింది. ఇంకా విద్యార్థి దశే... నాకా అదృష్టం అయిపోయింది. పాఠాలు చెప్పే బాధ్యత గల అధ్యాపకురాలినైపోయాను... రాజూ, బస్

మిస్ అవుతానేమో.... నేవెళతా !''

వెనక్కి చూడకుండా వెళ్లిపోయింది. అలా వెళ్లిపోగలగడం రంజని ప్రత్యేకత.

తనయితే అలా చూడకకుండా ఉండలేడు.

మరొకసారి.

బోటనీడిపార్టుమెంట్ వెనక చిక్కని అడవిలాంటి తోటలో. దట్టంగా అలముకున్న పెద్ద పెద్ద గుబుర్లు... ఎత్తయిన చెట్లు... కోకిల కల స్వరాలు... సుమారు ఏకాంతం.

పోస్టాఫీసు నుంచి వస్తున్న ఇద్దరూ తోటలోకి వచ్చేసరికి దబదబ వాన మొదలైంది. కొద్ది క్షణాలలో మోదెయ్యడం ప్రారంభించింది.

ఇద్దరూ ఒక చెట్టుకింద చేరారు.

''అలా వానవంక చూస్తూ వుంటే మైమరచేపోతాంకదూ !'' రంజని తన మౌనాన్ని ఆధారం చేసుకుని అంది.

''నాకయితే మైమరపు రావడం లేదు. మేను మేలుకుంటున్నట్టు వుంది''

''అంటే ?'' అమాయకంగా అడిగింది రంజని.

ఆమె అలా అమాయకమైన ప్రశ్న వేసినప్పుడు లేడిలా కళ్లుపెడుతుంది. గుండ్రంగా - పెద్ద కళ్లు... ఆశ్చర్యంగా.... అందంగా... గుండెల్లోకి తొంగిచూస్తున్నట్టు.

''అంటేనా...'' ఆమెను దగ్గరగా లాక్కుని ఏదో చెయ్యబోయాడు తను. ఆమె కాదనడానికి వీలు చిక్కకుండా ఏమిటేమిటో చేసెయ్యాలని ఆవేశం.

ఆకాశంలో మెరుపు మెరిసి మాయమైనట్టు తన పక్కనుంచి నడిచి ఎదురుగా వున్న మరొక చెట్టు క్రిందకు వెళ్లిపోయింది రంజని.

విద్యుల్లతని బాహుబంధంలో ఇమడ్చడం సుతారం కాదనిపించింది.

ఆ ఆలోచనలో కోపం రాలేదు... తన మీద ఆమెకీ కోపంలేదేమో ! కోపమే వస్తే అక్కడే ఎందు కుంటుంది ? అతను తీసుకోవాల్సిన చొరవ తీసుకోడం ఆలస్యం చేశాడా ? లేదా తీసుకున్న చొరవ హద్దు మీరిందా ?

ఏదయినా అదొక వింత అనుభూతి.

''మనసు ముందు జడివాన వెలిసేలాలేదు. చెట్లని పెనవేసుకోడమేకాక నేలనున్న గుబుర్లను ముంచెత్తి నేల మీద ఎర్రనిచిన్న పూలతో వున్న లత... ఆకుపచ్చ పానుపు మీద గులాబీరెక్కలు. అగరొత్తుల సువాసన.... పాలమీగడ, మల్లెల గుబాళింపు... గంధ పరిమళం... కర్పూరపు పేర్లు హత్తుకున్న తియ్యటి సౌరభం...

రాజుకి అక్కడ నుంచి లేవాలనిపించలేదు.

ఆవాన అలా అలా కురుస్తూనే ఉండాలని ఉంది ... ఆవానలో, ఆ చల్లదనంలో ... ఆ సుగంధంలో ... మనసు నిండా మకరందం నిండుతోంది.

- రంజని తన గదిలో లైటు ఆర్పేసినా - మంచంపైకి వెల్లకిలాపడుకుని తండ్రి తీసుకొచ్చే కబురు కోసం ఎదురుచూస్తోంది.

హాల్లో గడియారం పదికొట్టింది.

'' ఏమన్నారు వాళ్లు ?'' తల్లి గొంతు.

'' అబ్బాయిని అడిగి చెబుతామన్నారు .... నా ఎదుటే అడుగుతామన్నారు ... కాని ఆ అబ్బాయి ఇంకా ఇంటికి రాలేదు ....''

రంజనికి మరి మాటలు వినపడలేదు. అరగంట క్రిందట నిద్రవస్తున్నట్లనిపించింది. ఇప్పుడు ఎంత ప్రయత్నం చేసినా నిద్రరాదే ?

పెరట్లోకి వెళుతుంటే తల్లి అంది –

'' వెనక వీధేకదా, రేపూ మంచిరోజే .... మరోసారి వెళ్లి...''

రంజనికి మనసులో ఏదో గుబులు, బెంగ...

రాజుకి అంత కోపం వచ్చిందా ?– ఇంటికి రాకుండా... ఛీ ! తను మూర్ఖంగా ప్రవర్తించింది తనకు కావాల్సి కూడా .... కోరుతున్నది చేతి కందుతున్నప్పుడు బెట్టుచెయ్యడం ....

ఆలోచనలతో గంటలన్నీ వింట్లూనేవుంది. కాని నిద్రఎప్పుడు పట్టిందో.... లేచేసరికి ఏడయి పోయింది.

నిజంగా రాజును ఎప్పుడు కలుస్తానా అన్న ఆత్రుత. లంచ్ టైమ్‌లో కాలేజి నుంచి డిపార్టు మెంట్‌కి ఫోన్‌చేసింది. డిపార్టుమెంట్ అయితే దొరికింది కాని రాజు రూమ్‌లో లేడని ఎవరో ఫోన్ పెట్టేశారు.

సాయంకాలం ఇంటికి వచ్చేసరికి తల్లి చెప్పింది ముహూర్తం కూడా పెట్టేసినట్టు.

పెళ్లిపీటలమీద నించి ఎన్నిసార్లు తలెత్తిచూసినా రాజు ఏదో ఆలోచనలో వున్నట్టే కనపడింది రంజనికి.

తన శరీరతత్వాన్ని శాస్త్రీయ దృక్పథంతో అంచనా వేసి లోపం ఉందని అనుమానిస్తున్నాడా ?

ఎంత కూడదనుకున్నా కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి.

''ఛీ ! ఏమిటిదీ ?'' వదిన కాబోలు.

రాజులో కదలికలేదు.

రాత్రి సందడికి ఏర్పాట్లు, పూలజడ, జడగంటలు, అగరొత్తులు... సెంటు ఘుమఘుమలు. మల్లెపూలు, తెల్లచీర, మల్లెలు విరజిల్లబడిన మీగడలాంటి తెల్లపానుపు.

రాజు లేచినుంచున్నాడు.

'' పాలు !'' మందరంలో వీణ మోగినట్టు కంకణ నిక్వాణం.

'' వద్దు '' షడ్జమంలో సన్నాయి.

రంజని పాలగ్లాసు బల్లమీద పెట్టింది. రాజు తనని ఏడడుగులు వేయించి పానుపుమీద కూర్చోబెడతాడనుకుంది.

కాని రాజులో చలనంలేదు.

రంజని గొంతుసవరించుకుంది.

'' కోపం పోలేదన్నమాట ! '' వీణమీదసావేరి పలికనట్లంది.

'' ......''

'' నేటికి పదహారేళ్లకి మీరు తాత కావచ్చు ''

కదనకుతూహలం పరవళ్లు తొక్కుతున్నట్టుంది.

" నేటికా ?"

" మన బిడ్డ పధ్నాలుగో యేడు పుష్పవతి అయితే .... మరో ఏడాదికి పెళ్లి చేస్తే .... మీరు తాత ..."

" అంటే ? "

" అంటే... ఇది ...." రంజని విజృంభించి అతని చేతులని తనభుజాలపైకి వేసుకుని అతని కళ్లలోకి చూసింది.

" ఇదంటే ?"

– " ఇదీ " కామేశ్వర్రావ్ వెనక నుంచి వచ్చి రాజ్యాన్ని వాటేసుకున్నాడు.

" అబ్బ ! ఉండండీ ! మంచి రసఖండంలో ఉన్నా !"

" మరి నామాటో ! నీ నాయక వాసకసజ్జిక .... కాని నాయకుడు ధీరోద్ధతుడైపోయాడు"

" అంటే ? "

"సోదాహరణ ప్రసంగానికి ఇది సమయం కాదు. వాళ్ల కథపై తెర ఎలా వేయాలో... వేసిన తలుపుల సందులోంచి తలపులు చూపిస్తా ... నాకా అవకాశం ఇస్తే ...."

" ఇందండి ! " పెన్ను అందించింది రాజ్యం.

" ఇదెందుకు ? నీకు మెలకువ వచ్చాక ... అంటే నాకు నిద్రపట్టేశాక నువ్వే పూర్తి చేసుకుందువ్‌గాని ..."

" అబ్బ ! ఉండండీ ! వదలండీ ! ప్లీజ్!.... మంచివాళ్లు కదూ ... ఎంతో మంచి బుద్ధి మా వారిది..... మంచి మూడ్ వచ్చిందండీ !"

"రాజ్యం ! నీ నాయిక అతన్ని మంచిమాటలతో వశం చేసుకోలేదు ... ధీరలలితుడైనా కోపంతో ధీరోద్ధతుడై – శరుడై బిర్రబిగిసిపోయాడతను. అతని మనసులో కసి ... ఇంక మాటలతో పని జరిపించలేవు "

" అంటే ?"

" ఇది ..." " ఆమెను పడకగదిలోకి తీసుకువెళ్లి అలింగనం చేసుకుని పెదవిని పెదవితో స్పృశించాడు కామేశ్వర్రావ్.

కొద్ది క్షణాలు మైమరచిపోయినా వెంటనే తేరుకుంది రాజ్యం.

" ఒక్క పది నిముషాలు ... ప్లీజ్... మీరు చెప్పిన ముగింపే .... ఈ కసికి విరుగుడు.... అబ్బ ఉండండీ ! ఆ లతాంగిని ఆ ఘోరమన్మథావస్థలో ఉంచడం ... మీరేం మగమహారాజులు. మీకు తెలియదు ఆబాధ ... చూజూస్తూ సాటి ఆడదానిగా ..."

రాజ్యం రంజనిచేత ఏం చేయిస్తోందో ఊహించుకుంటూ రాజాతో తాదాత్మ్యం పొందుతున్నాడు ఊహాలోకంలో కామేశ్వర్రావ్.

కాని రాజ్యానికి ఆ పరిస్థితితో వ్యక్తిగతమైన అనుభవంలేదే అని ఓ వంక ఆశ్చర్యమూ కలుగుతోంది.

" దేవీ ! ఒక్కవరం ! "

– పది నిముషాల తరువాత రాజ్యం గదిలోకి అడుగుపెడుతూ ఉంటే అడిగాడు కామేశ్వర్రావ్.

" ఏమిటి ప్రియా, అది ? "

రంజనికి ఉన్నట్టే ఆమెకీ, మత్తుగా, మెత్తగా తియ్యగా ఉంది.

" నువ్ రాసిన శృంగారరచనకి నీ నిజనామధేయం వాడడం గడుగ్గాయిల్లాంటి స్నేహితులున్న నాకు శ్రేయస్కరం కాదేమో "

అంటూ ఆమెను అమాంతం మీదకు లాగేసుకున్నాడు కామేశ్వర్రావ్.

స్వాతి సపరివారపత్రిక

[illegible]-6-85